స్వాతి - మే, 1988

"నాణేనికున్నట్లే అవార్డులకూ బొమ్మా, బొరుసూ ఉంటాయి-"

# సాహితీ ప్రపూర్ణులు

పేరు తెచ్చుకున్న కవులను, రచయితలను చూస్తుంటే నాకెంతో అసూయగా ఉంటుంది - నేనూ రచయితను కాబట్టి! వారందరూ అశ్రయించో, ఆశపెట్టో గొప్పవారయ్యారని నా నమ్మకం. వాళ్ళ రచనలు చదివినప్పుడల్లా నా నమ్మకం మరింతగా బలపడుతూంటుంది. నేను చేసిన ప్రతి రచనా వారి రచనలకంటె ఎన్నోరెట్లు గొప్పదని తోచడం అందుక్కారణం కావచ్చు.

నా రచనలు చాలా ఎక్కువగానే పత్రికల్లో వచ్చాయి. వాటిలో కొన్ని మంచి పేరుకూడా తెచ్చుకున్నాయి. కానీ నాకు మాత్రం మరీ ఎక్కువ పేరు రాలేదు.

ఒకసారి నా నవలనోపత్రిక ఉత్తమ రచనగా ఎన్నుకుని బహుమతినిచ్చింది. ఆ సందర్భంలో మా ఊరివాళ్ళు నాకు సన్మానం చేశారు. సన్మానసభకు గోవిందరాజులు ముఖ్య అతిథిగా వచ్చాడు. తెలుగునాట గోవిందరాజులు పేరు వినని వారుండరు. పండిత పామరులను సమంగా రంజింపజేయగల రచనలెన్నో చేశాడాయన. ఆయన ప్రతి రచనలోనూ సామాజిక ప్రయోజనమూ, సాహిత్య ప్రయోగమూ ఉంటాయి. నేనాయన అభిమానిని. రచనలు చేయడంలో ఆయనంతటివాడిని కావాలన్నది నా కోరిక. ఇంతవరకూ ఆయనలో వెయ్యోవంతు స్థాయికి కూడా నేను చేరుకోలేదని నా విచక్షణ నాకు చెబుతోంది.

సన్మానసభలో ఆయన ప్రసంగిస్తూ - "ఈ చిరంజీవి వ్రాసిన నవల చదివాను. నవల నన్ను చదివించింది. కదిలించింది. తెలుగునాట మరో సాహితీభాను డుదయించాడు" అంటూ ప్రశంసించాడు.

అప్పుడు నేనూ ఊరుకోలేదు. గోవిందరాజుల్ని ఆకాశానికెత్తేసి నా తక్కువతనాన్నం గీకరించి, "సాహితీ స్థాయిలో ఏనాటికైనా శ్రీ గోవిందరాజులులో సగానికి చేరుకోగలిగితే నా జన్మ సార్థకమైనట్లే భావిస్తాను" అన్నాను.

గోవిందరాజులు నా వినయాన్ని మెచ్చుకుని, "ఏనాటికైనా నాబోంట్లనిటువంటి రచయితలే దెబ్బతీయగలరు. నన్ను మించినవారు లేరన్న అహం నాలో ఏర్పడకుండా ఉండాలంటే ఇలాంటివారు అవసరం" అన్నాడు.

అప్పుడు నేనెంతో సంతోషించాను. ఆ తర్వాత కొద్ది నెలలకే ఒక యూనివర్సిటీ గోవిందరాజులుకు "సాహితీ ప్రపూర్ణ" బిరుదునిచ్చి సత్కరించింది. ఆ బిరుదు అరుదైనది. నా రచనను మెచ్చిన గోవిందరాజులు కది లభించడం వల్ల నాకూ ఆ గౌరవంలో కొంత భాగం చెందినట్లే భావించాను.

ఆశ్రయం వల్ల కాక అర్హతతో పేరు తెచ్చుకున్న అతికొద్దిమంది రచయితలలో గోవిందరాజులు ఒకడని నా అభిప్రాయం.

ఇలా ఉండగా దేశంలో పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. నాకంటే ఒక సంవత్సరం చిన్న అయిన నా స్నేహితుడొకడు ఎమ్మెల్యే అయ్యాడు. అతడికి ఎన్నికల ఉపన్యాసాలు నేనే రాసిపెట్టడం వల్ల అతడికి నేనంటే గురుభావం.

ఆశ్రయంవల్లనే రచయితలు పేరు తెచ్చుకుంటున్నారని నేను తరచుగా అనేవాణ్ణి. అది తప్పన్నభావం నా మాటల్లో సూచించబడేది. అందుకేనేమో ఎమ్మెల్యే కాగానే నా స్నేహితుడు మా యింటికి వచ్చి, "నేనిప్పుడు పదవిలోకి వచ్చాను. నా పదవి నా స్నేహితులకుపయోగపడాలని నాకుంటుంది. నేనిప్పుడు నీకు సాయపడగలను. నీ రచనలకు గుర్తింపు తేగలను. కానీ ఆశ్రయానికి నువ్వు వ్యతిరేకివి. నేనేం చేయను? అని బాధపడ్డాడు.

ఇది విని నేను కలవరపడ్డాను. ఈ విధంగా జరుగుతుందని నేనూహించలేదు. అప్పటికి లౌక్యంగా, "నా ఆశయాలు నీకు తెలుసు. గుర్తింపు గురించిన తాపత్రయం నాకు లేదు. కానీ అర్హతతో కూడిన గౌరవం లభిస్తే నేనెప్పుడూ కాదనను" అని ఊరుకున్నాను.

అలా రెండు సంవత్సరాలు గడిచాయి. ఈ రెండేళ్ళలోనూ రాష్ట్రంలో చాలా మార్పులొచ్చాయి. కొత్త ప్రభుత్వం ఎన్నో అవకతవకలు చేస్తున్నదనీ, హాస్యాస్పదంగా ప్రవర్తిస్తున్నదనీ పత్రికలు ఘోషిస్తున్నాయి. అది ప్రతిపక్షాల అసూయ అని కొత్త ప్రభుత్వం బదులిస్తోంది. ఎవరేమన్నా సామాన్య ప్రజలు మాత్రం కొత్త ప్రభుత్వానికి మద్దతునిస్తున్నారు. వత్తాసు పలుకుతున్నారు.

నేను డైలమాలో పడ్డాను. ఎందుకంటే నా ఎమ్మెల్యే స్నేహితుడు నాతో, "ఎందరో రచయితలు మా ప్రభుత్వాన్ని ఎగతాళి చేస్తూ రచనలు చేస్తున్నారు. ప్రతిపక్షాన్ని అన్యాయంగా సమర్థిస్తున్నారు. ఈ సమయంలో నీవు మా ప్రభుత్వానికి అనుకూలమైన రచనలు చేస్తే అది నీకూ, మాకూ కూడా లాభసాటిగా ఉంటుంది!" అన్నాడు.

రచయిత స్వలాభంకోసం కాక మనస్సాక్షికి అనుకూలంగా రచనలు చేయాలని నాకు తెలుసు. అందులోనూ నా అభిమాన రచయిత గోవిందరాజులు తన రచనలతో ప్రస్తుత ప్రభుత్వాన్ని దుయ్యబడుతున్నాడు. అవి చదువుతూంటే నాకూ కొత్త ప్రభుత్వాన్ని

దుయ్యబట్టాలనిపిస్తోంది.

గోవిందరాజులు తన మనస్సాక్షికనుకూలంగా రచనలు చేస్తాడని నా నమ్మకం. గతంలో ఆయన ఇతర ప్రభుత్వాల్నీ విమర్శించాడు. కానీ యింతలా ఎప్పుడూ రాజకీయాల్లో జోక్యం చేసుకోలేదు. నా స్నేహితుడు చెప్పిన ప్రకారం ఆయన నిప్పుడు ప్రతిపక్షాలు డబ్బిచ్చి ప్రోత్సహిస్తున్నాయి.

నాణేనికి బొమ్మ, బొరుసు ఉంటాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నేనో పత్రికలో "నాణేనికి మరోవైపు" అన్న పేరిట ఓ శీర్షికను ప్రారంభించాను. అందులో ప్రస్తుత ప్రభుత్వానికి అనుకూలంగా రచనలు చేయసాగాను.

గోవిందరాజులు భాష, శైలి వేరు. అన్నింటికీ మించి అరవై ఏళ్ళ అనుభవ మాయనిది. నాదా ముప్పైమూడేళ్ళ వయసు. ఈ కారణాల వల్లనేమో నా శీర్షిక ప్రజానీకాన్ని పెద్దగా ఆకర్షించలేదు. గోవిందరాజులు తన రచనల్లో నా శీర్షికను గురించి అనామకుడి అనవసరపుటావేదనగా ప్రస్తావించాడు.

నాకు చేతకాని రంగంలో అడుగుపెట్టినందువల్ల నా రచనా శక్తి సన్నగిల్లింది. నేను నిజంగానే అనామకుడిని కాసాగాను. ఈ విషయం నా ఎమ్మెల్యే స్నేహితుడితో ప్రస్తావించి ఆ శీర్షికను నిలుపుచేద్దామన్నాను. అప్పటికే ఆ శీర్షికను నిలుపు చేయమని పత్రికపై ఒత్తిడి బయల్దేరడంవల్ల పరిస్థితి నర్థంచేసుకుని నా స్నేహితుడూ అందుకంగీకరించాడు.

శీర్షికను నిలువుచేసేటప్పుడు పత్రికలో ఈ విధంగా ప్రకటన వచ్చింది.

"ఫలానా రచయిత తన కలంతో ఎన్నో అద్భుత రచనలు చేశాడు. రాజకీయా లాయన కథా వస్తువు కాదు. అయినప్పటికీ ప్రజాభిమానం చూరగొన్న ప్రభుత్వాన్ని అర్థరహితంగా విమర్శించే కొందరు రచయితల నేల విడిచిన సామును భరించలేక ఆయన "నాణేనికి మరోవైపు" శీర్షికను ప్రారంభించాడు. రాజకీయాలు తన మనస్తత్వానికి సరిపడని కారణంగా ఆయన ఈ శీర్షికను తామింక కొనసాగించలేమం టున్నాడు. మేమెంత వేడుకున్నా వారంగీకరించకపోవడం వల్ల ఈ శీర్షికను నిలుపు చేయడం మాకు తప్పనిసరి అయింది. రచయితలు తాత్కాలికావేశంతో కాక మనస్సాక్షికి అనుకూలంగా రచనలు చేయాలన్న వారి ఉన్నతాశయాన్ని మేము గౌరవిస్తున్నాము. వారికంటే ఉన్నతస్థానంలో ఉన్నామనుకునే రచయితలు కూడా ఆయన మార్గాన్ననుస రించడం తెలుగుసాహిత్యానికి మేలు చేస్తుంది. ఈ విషయంలో పాఠకులకు కలిగించిన అసౌకర్యానికి చింతిస్తున్నాము."

ఆ ప్రకటన చదివి నేనెంతో సంతోషించాను. ప్రజలు తిరస్కరించిన నా శీర్షికను నిలుపుచేస్తూ నన్ను గౌరవించిన ఆ సంపాదకుడికి నా మనసులోనే జోహారులర్పించాను. అయితే అతికొద్ది కాలంలోనే ఆ శీర్షిక పునరుద్ధరించడింది. మరో రచయిత ఆ పని చేబట్టాడు. నేను చూస్తూండగానే ఆ శీర్షిక నలుగురిలోనూ పేరు తెచ్చుకుంది. ఆ శీర్షిక కారణంగా గోవిందరాజులు వంటి మహా రచయితకూడా వెనక్కి తగ్గవలసివచ్చింది.

ఇది నాకెంతో బాధను కలిగించింది.

రచయితగా నాలో ఏదో లోపముంది. అదేమిటో తెలుసుకునేవరకూ కొత్త రచనలు చేయకూడదు.

ఇలా నిర్ణయించుకుని అంతవరకూ నేను చేసిన రచనలన్నింటినీ మరోసారి చదివాను. అప్పుడు నేను గ్రహించినదేమిటంటే బహుమతి పొందిన దానితో సహా మొత్తం నా రచనలన్నీ లోపభూయిష్టంగానే ఉన్నాయి.

మరి - అప్పట్లో గోవిందరాజులు నా రచనల్నెందుకు పొగిడినట్లు?

నలుగురితో చర్చించగా తెలిన విషయమేమిటంటే - గోవిందరాజులే కాదు. సన్మానసభకు వచ్చిన ఏ ముఖ్య అతిథి అయినా అలాగే మాట్లాడతాడు. అసలు గోవిందరాజులు నా రచనల్ని చదివుండకపోయినా ఆశ్చర్యం లేదు.

నాలోని రచయిత నీరసించిపోయాడు. నేనిక రచనలు చేయకూడదని నిర్ణయించుకున్నాను.

అప్పుడే ఒక విచిత్రం జరిగింది.

గోవిందరాజుల్ని సత్కరించిన యూనివర్శిటీ నన్నుకూడా "సాహితీప్రపూర్ణ" బిరుదుతో సత్కరించబోతోందిట. అది నాకు అర్హతతో కూడిన గౌరవమే తప్ప ఆశ్రయంవల్ల వస్తున్నదికాదుట. నన్నంగీకరించవలసినదిగా కోరుతూ నా ఎమ్మెల్యే స్నేహితుడు నాకు ఉత్తరం వ్రాశాడు.

ఆశ్రయం కారణంగా పేరు తెచ్చుకునే వారందర్నీ నేను నిరసిస్తాను. కొద్దివారాలపాటు నేను నిర్వహించిన 'నాణేనికి మరోవైపు' శీర్షిక సాహిత్యపరంగా ఎటువంటి విలువలనూ కలిగిఉండకపోయినా నాకా 'సాహితీ ప్రపూర్ణ' బిరుదును సంపాదించి పెడుతోందని నాకర్థమయింది.

ఆశకూ, అంతరాత్మకూ మధ్య పోరాటం ప్రారంభమై నాలో అలజడి రేపింది. శ్రీమతి ముందు నా బాధను వెళ్ళబుచ్చుకున్నాను.

"మీ గొప్పతనాన్ని మీరు శంకిస్తున్నారు. అదే మీ గొప్పతనం. ఈ బిరుదుకు మీరు అర్హులు. ఈ విషయం చాలా కాలం క్రితం గోవిందరాజులుగారు కూడా చెప్పారు" అందామె.

"ఆయనకరవైఏళ్ళదాకా లభించని గౌరవం నాకు నాలుగు పదులు నిండకుండానే లభిస్తోంది. నాకంత అర్హత ఉందా?" అన్నాను.

"ఒక్కసారి దేశంలో పేరు తెచ్చుకున్న రచయితలతీరు గమనించండి. ప్రముఖ నాయకుల గతాన్ని గుర్తుచేసుకోండి. ఉన్నత పదవులలో ఉన్నవారందరి గురించీ ఆలోచించండి. ఎవరికీ అర్హత ఉన్నదనిపించదు. మీరు కనీసం సాహితీపరులు, సాహితీ గౌరవాన్నే అందుకుంటున్నారు. ఆలోచించండి. కాదనకండి" అంది శ్రీమతి.

ఆమె చెప్పింది నాకు నచ్చింది.

ఆ తర్వాత రెండు మాసాలకు యూనివర్శిటీ నుంచి నాకు ఉత్తరం వచ్చింది.

ఊహ వేరు వాస్తవం వేరు.

ఎన్నో సందేహాలు నన్ను పీడిస్తున్నప్పటికీ నేను యూనివర్శిటీకి నా అంగీకారాన్ని తెలియజేశాను. అతికొద్దికాలంలోనే "సాహితీ ప్రపూర్ణ"డనయ్యాను.

బిరుదునందుకున్న కొద్దిరోజులకే నాకు నా స్నేహితుడినుంచి ఉత్తరం వచ్చింది. కవరు విప్పి ఉత్తరం చదివి ఆశ్చర్యపోయాను.

"గౌరవనీయులైన విద్యా శాఖామాత్యులకు -

శ్రీ "ఫలానా"కు "సాహితీ ప్రపూర్ణ" బిరుదు ప్రదానం జరిగింది. ఆ తర్వాత మీరనుకున్నట్లే గోవిందరాజులు గర్వం అణిగింది. సాహితీ ప్రపూర్ణ బిరుదునందుకుని తనంతటివాడులేడని విర్రవీగుతున్న ఆయనకిప్పుడు - అడ్డమైన వాళ్ళకూ, అనామకులకూ కూడా ఆ బిరుదు లభించగలదని అర్థమై, తన విలువ, స్థాయి తగ్గిపోయిందని బాధపడుతూ కుమిలిపోతున్నాడు. ఈ విషయంలో మీ దూరదృష్టికి అభినందనలు. ఎప్పుడూ మీ అడుగు జాడల్లో నడిచే నాకు మున్ముందు కూడా మీ భావాలను ఆచరణలో పెట్టే అవకాశమిస్తూండగలరు.

ఇట్లు - విధేయుడు

......................."

ఉత్తరం పొరపాటున కవరు మారిందని గ్రహించాను. కానీ ఆ పొరపాటు నా సందేహాలన్నింటికీ సమాధానమిచ్చింది.

నాకు సాహితీప్రపూర్ణ బిరుదు - ఎందుకు వచ్చిందో ఎలా వచ్చిందో గ్రహించేక - నా సన్మాన సభలో కొద్ది సంవత్సరాలక్రితం గోవిందరాజులన్నమాటలు గుర్తుకొచ్చాయి - "ఏ నాటికైనా నాబోంట్లనిటువంటి యువరచయితలే దెబ్బతీయగలరు. నన్ను మించినవారు లేరన్న అహం నాలో లేకుండా ఉండాలంటే ఇలాంటివారు అవసరం" అన్నాడాయన.

ఆయన ఏ ఉద్దేశ్యంతో ఆ మాటలన్నప్పటికీ నేనది నిజం చేశాను.

✦ ✦ ✦